క్లుప్తంగా

మైనర్ విద్యార్థినిపై స్వీపర్ అత్యాచారం

ఫోక్సో కేసు నమోదుచేసిన పట్టణ సీఐ

బాపట్లటౌన్: పట్టణంలోని ఓ స్కూల్ 7వ తరగతి చదువుతున్న విద్యార్థినిపై స్వీపర్ అత్యాచారం చేసిన ఘటన మంగళవారం జరిగింది. ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు గత 6 నెలల నుంచి హైస్కూల్‌లో స్వీపర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఓ వసతి గృహం నుంచి ప్రతిరోజు పాఠశాలకు వచ్చి వెళ్తున్న బాలికతో మాటలు కలిపి తినుబండరాలు ఆశ చూపి పాఠశాల ప్రాంగణంలోని నూతనంగా నిర్మిస్తున్న పాఠశాల భవనంపై అంతస్తులోనికి తీసుకెళ్లి అత్యాచారం చేశారు. ఈ విషయాన్ని గమనించిన సహచర విద్యార్థులు ఉపాధ్యాయురాలికి సమాచారం అందించడంతో పాఠశాల ప్రాధానోపాధ్యాయురాలు ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ యు. శ్రీనివాసులు నిందితుడు శ్రీనివాసరావుపై ఫోక్సో కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మున్సిపల్ సాధారణ సమావేశం

రేపల్లె రూరల్: పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రామ బోపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి కౌన్సిలర్‌లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

పేదలకు వస్త్రాలు పంపిణీ

చెరుకుపల్లి: తురిమెళ్ల లక్ష్మణరావు–భాగ్యరాజ్ ట్రస్ట్ నిర్వహకురాలు తురిమెళ్ళ రూతమ్మ జనవరి పండగను పురస్కరించుకుని మండలంలోని గూడవల్లి గ్రామంలో పేదలు, వితంతువులు, వృద్ధులకు మంగళవారం 200 మందికి దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ కె.మాణిక్యారావు, బి.బాబూరావు, అంబేడ్కర్ యూత్ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వెల్లటూరులో జనవరి పండగ

వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరులో జనవరి పండుగ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు రెవరెండ్ సీహెచ్ జాన్ డేవిడ్ జరిపారు. వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు తనయులు గౌతమ్, శ్రీ తేజస్ పాల్గొన్నారు. ట్రాక్టర్‌పై జెండాను ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరించి, పుర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. సంఘ పెద్దలు, స్త్రీల సమాజం , సంఘస్తులు పాల్గొన్నారు.

సమాజ సేవకుడు వందనంకు గౌరవ డాక్టరేట్




కర్లపాలెం: పేరలి గ్రామానికి చెందిన సమాజ సేవకుడు వీరాస్వామి సర్వీస్ ఫౌండర్, చైర్ పర్సన్ గొర్రుముచ్చు వందనానికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. వందనం వీరాస్వామి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన చేస్తున్న సమాజ సేవలను గుర్తిస్తూ ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. హైదరాబాద్‌లోని సిటీ కల్చరల్ వేదికపై స్ఫూర్తి సర్వీసెస్ ఆధ్వర్యంలో సోమవారం వందనంకు డాక్టరేట్‌ను అందజేశారు. స్ఫూర్తి సర్వీసెస్ ఫౌండర్ అండ్ చైర్మన్ ఆకుల రమేష్, కె.ముందయ్య గౌడ్, జి.నరసింహరావు, జి.వినోద్‌కుమార్, ఏడుకొండలు, షాలిమ్‌రాజు, అనూష పాల్గొన్నారు.

8న బాపట్లలో షర్మిల పర్యటన

బాపట్ల అర్బన్: పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఫిబ్రవరి 8న బాపట్లలో పర్యటించనున్నారని, నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు పఠాన్ రాజేష్ పిలుపునిచ్చారు. పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పీసీసీ పదవి చేపట్టిన తర్వాత షర్మిల మొదటసారిగా జిల్లాకు వస్తున్నట్లు తెలిపారు. మండల అధ్యక్షుడు పల్లపట్ల శంకర్ రెడ్డి, సీనియర్ నాయకులు రోశయ్య పోల్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు దండు రేణుక, అమ్మునుల్లా బేగ్, దోనేపూడి రవి, శీలం సాగర్ పాల్గొన్నారు.

గాంధీ సిద్ధాంతాలు నిత్య నూతనం



బాపట్ల అర్బన్: జాతిపిత మహాత్మా గాంధీ సిద్ధాంతాలు నిత్య నూతనమని, ఆయన బోధనలు అజరామరం అని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పీసీ సాయిబాబు అన్నారు. ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం గాంధీ వర్ధంతి నిర్వహించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. డీటీ కె.శ్రీదేవి, సర్వేయర్ మాధవి, సిబ్బంది భవానీ, శ్రీనివాస్, గౌరీ పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు
- రేపల్లెలో జాబ్ మేళాకు 758 మంది హాజరు



జాబ్ మేళాలో మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

రేపల్లె రూరల్: నిరుద్యోగ యువత తమకు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని, ఉపాధి పొందాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ–ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించారు. ఎంపీ ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నిరుద్యోగ యువతపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి లక్షల ఉద్యోగాలను భర్తీ చేసిన అంశాన్ని గుర్తుచేశారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా ప్రముఖ కంపెనీలతో జాబ్ మేళాను నిర్వహించి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. వివిధ కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూలకు తీరంలోని వివిధ ప్రాంతాల నుంచి 758 మంది అభ్యర్థులు హాజరుకాగా 236 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి తమ్మాజీరావు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్, కళాశాల ప్రిన్సిపల్ రవిచంద్ర, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ పాల్గొన్నారు.

దళిత బహుజనులకు కానుకగా అంబేడ్కర్ భవనం

రేపల్లెరూరల్: తీరప్రాంత దళిత బహుజనుల చిరకాల కోరిక అంబేడ్కర్ భవనాన్ని పూర్తిచేసి త్వరలో కానుకగా అందజేస్తామని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు చెప్పారు. ఆర్ అండ్‌బీ అతిథి గృహం సమీపంలో ఎంపీ గ్రాంట్ రూ.1.15 కోట్లతో జరుగుతున్న అంబేడ్కర్ భవన నిర్మాణ పనులను మంగళవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్‌తో కలిసి ఆయన పరిశీలించారు. దళిత బహుజనుల కోరిక మేరకు 2013లో ఆర్‌అండ్‌బీ అతిథి గృహం సమీపంలో జిల్లా పరిషత్ స్థలాన్ని అధికారికంగా అంబేడ్కర్ భవనానికి కేటాయించి, భవన నిర్మాణానికి రూ.35లక్షల నిధులు కేటాయించామన్నారు. అనంతరం పాలకుల నిర్లక్ష్యంతో భవన నిర్మాణం మరుగునపడిందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో అంబేడ్కర్ భవనానికి ఇటీవల శంకుస్థాపన చేసి నాణ్యతా ప్రమాణాలతో నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ చైర్ పర్సన్ కట్టా మంగ, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, వివిధ వార్డుల కౌన్సిలర్‌లు తదితరులు పాల్గొన్నారు.

కేటీ కాలనీ వాసులకు పట్టాల పంపిణీకి కృషి

ఆర్డీఓ హేల షారోన్



కేటీ కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఆర్డీఓ హేల షారోన్

కొల్లూరు : రహదారి అంచుల వెంబడి నివసిస్తున్న వారికి శాశ్వత నివాసిత పట్టాలు మంజూరు చేసేందుకు కృషి చేస్తామని రేపల్లె ఆర్డీఓ హేల షారోన్ అన్నారు. మంగళవారం కొల్లూరు శివారు కేటీ కాలనీలో రహదారి వెంబడి నివసిస్తున్న కుటుంబాలను ఆమె సందర్శించారు. గతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి మేరుగ నాగార్జున దృష్టికి స్థానికులు తమ సమస్యలను తీసుకొచ్చారు. తెలంగాణ నుంచి 8 దశాబ్దాల క్రితం వచ్చి స్థిరపడిన తాము నివాసాలకు పట్టాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. పట్టాల మంజూరుకు కృషి చేస్తామని అప్పట్లో మంత్రి వారికి హామీ ఇచ్చారు. ఆయన ఆదేశాలతో తహసీల్దారు ఎ. శ్రీనివాసరావు ఆ దిశగా చర్యలు చేపట్టారు. నివేదికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందించారు. సాధ్యమైనంత త్వరగా ఇళ్ల పట్టాలు ఇస్తామని ఆర్డీఓ వారికి హామీ ఇచ్చారు. శ్మశాన వాటిక లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, డ్రెయినేజ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరడంతో.. శ్మశానానికి అవసరమైన స్థలం కొనుగోలుకు స్థలాన్ని పరిశీలించాలని తహసీల్దారును ఆర్డీఓ ఆదేశించారు. అనంతవరం సచివాలయాన్ని ఆర్డీఓ సందర్శించారు. జగనన్న కాలనీల్లోని లబ్ధిదారుల పేరిట ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించిన ఆమె రిజిస్ట్రేషన్ కార్యకలాపాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ త్రివేణి, వీఆర్‌ఓలు రవికుమార్, బేగ్‌లు పాల్గొన్నారు.

అహింసకు మారుపేరు జాతిపిత మహాత్మాగాంధీ



భట్టిప్రోలులో గాంధీజీ చిత్రపటానికి ప్రజా ప్రతినిధుల నివాళి

భట్టిప్రోలు: అహింసకు మారుపేరు జాతి పిత మహాత్మాగాంధీ అని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి పేర్కొన్నారు. మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఎంపీపీ లలిత కుమారి మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే అమలవుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, తహసీల్దార్ డి. వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు శేతు రామచంద్రరరావు, శివకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. టీఎంరావు హైస్కూల్‌లో గాంధీ విగ్రహం, చిత్రపటాలకు దండలు, నూలు దండలు, పూలు, పండ్లు పెట్టి ప్రత్యేకంగా జాతీయ జెండా ఆకారంలో అందంగా తీర్చిదిద్దారు. ప్రధానోపాధ్యాయులు సి. రామకోటేశ్వరరావు, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీ సేవలు అజరామరం

రేపల్లె రూరల్: అహింసా సిద్ధాంతంతో దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన జాతిపిత మహాత్మా గాంధీ సేవలు అజరామరమని పేటేరు సర్పంచ్ కనపర్తి వసుమతి అన్నారు. పేటేరు సచివాలయ కార్యాలయంలో మంగళవారం మహాత్మ గాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. బాపూజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అంతర్జాతీయ కుష్టు నిర్మూలన దినం సందర్భంగా సచివాలయ అధికారులు, ఆరోగ్య సిబ్బంది, గ్రామ యువతతో కుష్టు వ్యాధి నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జ్ కనపర్తి రవికిరణ్, మాజీ ఎంపీటీసీ రావు ప్రభాకరరావు, పంచాయతీ సెక్రటరీ పుష్పకుమారి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఆశ వర్కర్‌లు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి కేరాఫ్ సీఎం వైఎస్ జగన్

నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ గణేష్



గుళ్లపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్

చెరుకుపల్లి: సంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కేరాఫ్ అడ్రస్‌గా మారారని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. సిద్ధం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుళ్లపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి నిర్వహించిన ఇంటింటి ప్రచారం కార్యక్రమంలో ప్రభుత్వ పథకాలను ప్రజలకు ఆయన వివరించారు. పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పరితపిస్తున్నారన్నారు. వారి ఆర్థిక భద్రతకు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, సచివాలయ వ్యవస్థ ద్వారా నూరు శాతం అమలు చేస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. వలంటీర్లు, సచివాలయాల ద్వారా అనేక సంక్షేమ పథకాలను అందిస్తూ.. ప్రజాభిమానాన్ని చోరగొన్న గొప్ప వ్యక్తి జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. గ్రామంలో ఇంటింటా పర్యటించి, రానున్న ఎన్నికల్లో జగనన్నను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఈవూరి కేశవతి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌గా విజయసారథి సేవలు ఎనలేనివి

ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు



విజయసారథిని సత్కరిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు, కౌన్సిలర్లు

రేపల్లె రూరల్: ప్రజా ప్రతినిధులను, అధికారులను సమన్వయ పరుచుకుంటూ మున్సిపల్ కమిషనర్‌గా పట్టణాభివృద్ధిలో తన వంతు కృషి చేసిన విజయసారథి అభినందనీయుడని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. మున్సిపల్ కమిషనర్ విజయసారథి బదిలీపై వెళ్తున్న నేపథ్యంలో పట్టణంలోని పత్తిపాటి సీతారామయోగిని కల్యాణ మండపంలో మంగళవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీ మోపిదేవి పాల్గొన్నారు. పుర ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించిన విజయసారథి బదిలీపై వెళ్లటం ఈ ప్రాంతానికి తీరనిలోటు అని ఎంపీ పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఆయన మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ చైర్ పర్సన్ కట్టా మంగ, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీ విశ్వనాథగుప్త, కౌన్సిలర్‌లు, మెప్మా, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు వేంకటేశ్వర సప్తాహ వైభోత్సవాలు



తెనాలిటౌన్: పట్టణంలోని తాలూకా హైస్కూల్ గ్రౌండ్‌లో శ్రీ విద్యాపీఠం, సాలిగ్రామ మఠం సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న వేంకటేశ్వర సప్తాహ వైభోత్సవం రెండో రోజు మంగళవారం వైభవంగా జరిగింది. గోవిందనామ జపయజ్ఞ పూర్ణాహుతి భక్తిశ్రద్ధలతో పండితులు నిర్వహించారు. శ్రీ విద్యాపీఠం నిర్వాహకులు బాలస్వామిజీ పర్యవేక్షణలో ఉదయం శ్రీవారికి సుప్రభాతసేవ, ఊంజల్‌సేవ, తోమాలసేవ, గోమాతకు ప్రత్యేక పూజలు జరిపారు. శ్రీనివాసునికి విశేషంగా స్వర్ణపుష్పాలతో అర్చన, కొండూరు పద్మావతికి సౌందర్యలహరి, సహస్రగళార్చన 600 మంది మహిళలచే ఆలపించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీశ్రీశ్రీ త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార్ రామానుజ జీయర్ స్వామి శ్రీనివాసుని దర్శించారు. స్వామివారి విశిష్టతను భక్తులకు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో మఠం ట్రస్ట్ చైర్మన్ నంబూరి కృష్ణమూర్తి, సెక్రటరీ ఉప్పల నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ ఎం.రమణయ్య, రామకృష్ణ, రాజేశ్వరరావు, లోకనాధం, నరేంద్రస్వామి, సాలిగ్రామ మఠం, శ్రీ విద్యాపీఠం, జయలక్ష్మి మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాలు అందజేశారు.

కోవిడ్ అమర వైద్యులకు నివాళి

తెనాలిరూరల్: కోవిడ్ మహమ్మారి చెలరేగిన సందర్భంలో రోగులకు వైద్య సేవలు అందిస్తూ ప్రాణాలు కోల్పోయిన వైద్యులకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు ఘన నివాళి అర్పించారు. ఐఎంఏ తెనాలి శాఖ ఆధ్వర్యంలో ఇక్కడి బోస్‌రోడ్డు నుంచి గాంధీచౌక్ వరకు మంగళవారం రాత్రి కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎంఏ తెనాలి అధ్యక్షురాలు డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ పూర్తి చికిత్స విధానాలు లేని కరోనా వైరస్‌ను ఎదుర్కోవడంలో అమరులైన వైద్యులను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. డాక్టర్లు పావని, కోటినాగయ్య, అనిల్‌కుమార్, శ్యామ్‌ప్రసాద్, మధుప్రభాకర్, సాంబిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

తెనాలిఅర్బన్: చెత్తసేకరణను సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. మారీసుపేట అప్పలస్వామి గుడి రోడ్డులో మంగళవారం ఉదయం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. చెత్తను మూడు బుట్టల విధానంలో సేకరించాలని సూచించారు. అలాగే వార్డులో జరుగుతున్న మురుగు కాల్వల పూడికతీత పనులు పరిశీలించారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, పలువురు శానిటరి ఇన్స్‌పెక్టర్లు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

తెనాలి పట్టణ అభివృద్ధికి చర్యలు

- మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశానికి చైర్‌పర్సన్ రాధిక అధ్యక్షత వహించారు. అజెండా చదవటం ప్రారంభించగానే తన వార్డులో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా జరగటం లేదని, శానిటరి ఇన్‌స్పెక్టర్ అనుపమ పనితీరే దీనికి కారణమని, వెంటనే ఆమెను తన వార్డు నుంచి మార్చివేయాలని 31వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గోగిరెడ్డి మానసారెడ్డి కోరారు. సమావేశం పూర్తి కాగానే ఆమెను పిలచి మాట్లాడదామని చైర్‌పర్సన్ రాధిక హామీ ఇచ్చారు. అనంతరం అజెండాలోని 33 అంశాలు చదివి ఆమోదించారు. అనంతరం చైర్ పర్సన్ రాధిక మాట్లాడుతూ అజెండాలోని అన్ని అంశాలు ఆమోదించామని చెప్పారు. సమావేశంలో వైస్ చైర్మన్‌లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, కమిషనర్ ఎం.జశ్వంతరావు, ఎంఈ నాగమల్లేశ్వరరావు, పలువురు కౌన్సిలర్‌లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

బాపట్ల అభివృద్ధికి ఎనలేని కృషి

- ఎమ్మెల్యే కోన రఘుపతి
- పింఛనుదారులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

ఖాజీపాలెం(పిట్టలవానిపాలెం): బాపట్ల నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పించిన ఘనత కోన ప్రభాకరరావుకే దక్కుతుందని బాపట్ల ఎమ్మెల్యే సభ్యులు కోన రఘుపతి అన్నారు. ఖాజీపాలెం గ్రామంలో కోన చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సామాజిక పింఛనుదారులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ బాపట్ల నియోజకవర్గంలో మూడు సార్లు శాసన సభ్యుడిగా, పీసీసీ అధ్యక్షుడిగా, మూడు రాష్ట్రాలకు గవర్నర్‌గా పనిచేసి, ప్రజల మనస్సులో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. నాటి కోన ప్రభాకర్‌రావు హయాంలో నియోజకవర్గంలో 8 వేల మందికి ఇంటి నివేశన స్థలాలు ఇచ్చారని నేడు ఒక్క ఏడాదిలోనే 14,500 మందికి ఇంటి పట్టాలు అందించడం గర్వంగా ఉందన్నారు. జిల్లాను అభివృద్ధి చేసుకోవాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా, బాపట్ల శాసన సభ్యునిగా మూడోసారి తనను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. సచివాలయ పరిధిలోని సామాజిక పింఛనుదారులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడి, వైస్ ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు, గ్రామ సర్పంచ్ కుంతం అనూష, వైఎస్సార్ సీపీ నాయకులు కూసంపూడి దేవేంద్రరాజు, ప్రసన్నరాజు, పార్టీ రాష్ట్ర నాయకులు మండే విజయ్ కుమార్, మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, బడుగు ప్రకాశరావు, ఎంపీటీసీ సభ్యులు చల్లాపల్లి విజయరాజు, గంగయ్య, శివారెడ్డి, శ్యామల నాగిరెడ్డి, కోటిరెడ్డి, గోపి, దబ్బకూటి మాదవరావు, గుమ్మడి సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

జెండా పండగలో ..

పిట్టలవానిపాలెం: భవనంవారిపాలెం శివారు చోడిపాలెం ఎస్సీ కాలనీలో మంగళవారం జరిగిన జెండా పండగలో బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రార్థన మందిరంలో స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కాలనీ వాసులకు జెండా పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, నాయకులు కోటిరెడ్డి, న్యాయవాది కంచర్ల అవినాష్, సంఘ పెద్దలు ఉన్నారు.

దుప్పట్లు పంపిణీ చేసిన రచయిత కోన వెంకట్

కర్లపాలెం: నిరుపేదలకు చేయూతనందించటం అభినందనీయమని ప్రముఖ సినీ రచయిత, నిర్మాత కోన వెంకట్ అన్నారు. మండల పరిధిలోని ఏట్రవారిపాలెం, బుద్ధాం, యాజలి గ్రామాల్లో వైఎస్సార్ పింఛనుదారులకు కోన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కోన వెంకట్ వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, సర్పంచ్‌లు నాదెండ్ల భానుప్రసాద్, అక్కల శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీలు, ఆసిఫ్ అలీ, చీరాల పద్మావతి, సత్యనారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకునేందుకు చేయూతనివ్వాలి



దుప్పట్లు పంపిణీ చేస్తున్న పట్టణ సీఐ నజీర్‌బేగ్

రేపల్లె రూరల్: పేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని పట్టణ సీఐ నజీర్‌బేగ్ అన్నారు. పట్టణ ఆదర్శ వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని యాచకులకు మంగళవారం నిర్వహించిన దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో, ఇతర విపత్తుల సమయంలో తమ వంతు సేవలను అందించేందుకు పట్టణ ఆదర్శ వేదిక ముందుకు రావటం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లోనూ మరిన్ని సమాజ హిత కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆదర్శ వేదిక కార్యదర్శి యడ్లపల్లి కిషోర్, ఎన్. సాయికృష్ణమాచార్యులు, కె.నటరాజ్‌వర్మ, బి.మోహనరావు పాల్గొన్నారు.

సూరేపల్లిలో పూరిళ్లు దగ్ధం



అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

సూరేపల్లి(భట్టిప్రోలు): సూరేపల్లిలో మంగళవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తూ జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధమై రూ. 4 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన కొమరగిరి శివయ్య, కోటేశ్వరరావు పూరిళ్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. బాధిత కుటుంబాలు కట్టుబట్టలతో మిగిలాయి. సమాచారం మేరకు రేపల్లె అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. గ్రామ సర్పంచ్ మోర్ల విజయలక్ష్మి స్పందించి.. తక్షణ ఆర్థిక సాయంగా రూ. వెయ్యి అందించారు. బాధిత కుటుంబాలను ఎంపీటీసీ సభ్యురాలు రావు రాజేశ్వరి పంచాయతీ కార్యదర్శి టి. అనూరాధ, వైఎస్సాఆర్ సీపీ నాయకులు మోర్ల సత్యన్నారాయణ (బాబు), రావు చంద్రశేఖరరావు, వీఆర్వో లంకె సురేష్‌లు పరామర్శించారు.

ర్యాలీలో జేబుల దొంగల చేతివాటం

- దొరికిన జేబు దొరికినట్లు ఖాళీ.. సెల్‌ఫోన్లు, నగదు చోరీ..
- బాధితుల్లో టీడీపీ నేతలు, కార్యకర్తలు, మీడియా ప్రతినిధులు
- పోలీసుల అదుపులో ఇద్దరు దొంగలు..



స్థానికులు పట్టుకుని కొల్లూరు పోలీసులకు అప్పగించిన జేబు దొంగల ముఠా సభ్యులు

కొల్లూరు : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయడు సతీమణి నారా భువనేశ్వరి ర్యాలీ జేబు దొంగల మయమైంది. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా మంగళవారం చిలుమూరు కరకట్ట వద్ద నుంచి టీడీపీ శ్రేణులు భువనేశ్వరిని స్వాగతించారు. ర్యాలీ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో జేబు దొంగల ముఠా టీడీపీ శ్రేణులతో కలసిపోయి చేతివాటాన్ని ప్రదర్శించారు. భువనేశ్వరి చిలుమూరు చేరుకోగానే కార్యకర్తల హడావిడిని సొమ్ము చేసుకున్న జేబుదొంగలు.. పలువురి నాయకులు, కార్యకర్తల జేబుల్లో నగదు, సెల్‌ఫోన్‌లు, ఏటీఎం కార్డులతో సహా చోరీ చేశారు. కొల్లూరు మాజీ ఎంపీపీ కనగాల మధుసూదన్ ప్రసాద్ వద్ద నుంచి రూ. 10 వేలు, ఈపూరుకు చెందిన యువకుల నుంచి రూ. 7, 200, మరో వ్యక్తి నుంచి రూ. 4 వేలు నగదుతో పాటు, ఇద్దరి వద్ద నుంచి రెండు సెల్ ఫోన్‌లు తస్కరించారు. జేబు దొంగలు దొంగలించిన సొమ్ము, ఫోన్‌లను తమతోపాటే ద్విచక్ర వాహనాలపై వచ్చిన మరికొంత మందికిచ్చి... అక్కడి నుంచి పంపిచేస్తుండటం, జేబుల్లో నగదు దొంగిలించడ చూసిన ఓ వ్యక్తి స్థానికులతో కలసి దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నించారు. కొందరు పరారు కాగా, వారిలో ఇద్దర్ని పట్టుకుని దేహశుద్ధి చేసి కొల్లూరు పోలీసులకు అప్పగించారు. జేబు దొంగల చేతివాటం కారణంగా పోలీసుల దృష్టికి రాకుండా మరికొంత మంది వద్ద నుంచి సుమారు మరో రూ. 30 వేల వరకు చోరీ జరిగినట్లు బాధితులు వాపోతున్నారు. జేబు దొంగల చోరీల్లో మీడియా ప్రతినిధులు సైతం బాధితులుగా మిగిలారు.

టీడీపీ శ్రేణుల అసంతృప్తి..

నారా భువనేశ్వరి యాత్రపై టీడీపీ శ్రేణులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా ఆమె రేపల్లె నియోజకవర్గం చెరుకుపల్లి వెళ్లాల్సి ఉంది. ఉదయం 10 గంటలకు భువనేశ్వరి చిలుమూరు చేరుకోవాల్సి ఉండగా, మధ్యాహ్నం 1.15 గంటలకు చేరుకున్నారు. అప్పటికే మూడు గంటలకుపైగా ఎర్రటి ఎండలో నిల్చున్న కార్యకర్తలు వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, టీడీపీ నాయకులు కనగాల మధుసూదన్‌ప్రసాద్, మైనేని మురళీకృష్ణ పాల్గొన్నారు.